## ప్రథమ పటాలంలో వార్షిక కవాతు



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ సిద్ధిఖీ, కమాండెంట్ మురళీకృష్ణ

జూబ్లీహిల్స్, మార్చి 21: యూసుఫ్‌గూడ ప్రథమ పటాలం క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని టీఎస్ఎస్పీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎంఎస్ సిద్ధిఖీ అన్నారు. గురువారం ఫస్ట్ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో పటాలం వార్షిక తనిఖీ కవాతు ఘనంగా నిర్వహించారు. నేటితో ముగియనున్న వార్షిక తనిఖీల్లో బెటాలియన్ వెల్ఫేర్, క్యూఎం, ఎంటీ కార్యాలయాల రికార్డుల తనిఖీలతో పాటు బెటాలియన్ సిబ్బంది దర్బార్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ సిద్ధిఖీ, కమాండెంట్ పి.మురళీకృష్ణతో కలిసి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: రాష్ట్రంలో గౌడ కార్పొరేషన్‌తో పాటు వివిధ బీసీ కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్వామిగౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్పొరేషన్ కేవలం గౌడ కుల వృత్తిదారులకు సంబంధించిన కార్పొరేషన్ మాత్రమేనని, గౌడ కార్పొరేషన్ అనేది గౌడ కులం సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే కార్పొరేషన్ అని వివరించారు. అదేవిధంగా వివిధ బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం లో విద్యార్థి నాయకులు పుట్ట పవన్, రాజశేఖర్, బద్రి, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

# స్థిరమైన గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించాలి

- ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 21: వ్యవసాయ, అనుబంధ రంగాలపైనే ఎక్కువగా ప్రజలు ఆధారపడి జీవనం కొనసాగిస్తారని జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్డీ పీఆర్) డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీలో ఏర్పాటు చేసిన 'గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కృత్రిమ మేధస్సు'పై రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పీఆర్ చట్టాలపై అధికారులకు అవగాహన ఉంటేనే పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న ఇండియా వంటి దేశాల్లో అవసరమని అన్నారు. వ్యవసాయ రంగానికి అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు ఆశించిన స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం మనపై ఉందని పేర్కొన్నారు. ఆర్డీ, పీఆర్ కార్యక్రమాల్లో వివిధ నేపథ్య రంగాలపై స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. ప్యానెల్ చర్చలను కలిగిన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్యా పథకం అమలు, ఆడిట్ ప్రక్రియ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అంశాల్లో కీలకమైన నేపథ్యం, ఏ-1 ఆవశ్యకత పై సుదీర్ఘంగా చర్చించారు. కార్యాచరణ సామర్థ్యం, జవాబుదారితనం మెరుగు పర్చడానికి, ప్రజల విశ్వాసాన్ని పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్‌కుమార్, ఎంఓ పీఆర్ పంచాయతీరాజ్ పాల్గొని సిస్టమ్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. యూఎస్ఏ, బెల్జియం, ఇండియాకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విధాన నిపుణులతో సహా ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ నిపుణులు తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ప్రకాశ్‌కుమార్, ఆర్టీడీ డాక్టర్ రాజన్, ఐఐటీ రిజిస్ట్రార్ రవీంద్ర మాట్లాడారు. అనంతరం వివిధ సాధనాలు, నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలల, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



జూబ్లీహిల్స్, మార్చి 21: తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ రాధాకృష్ణన్‌ను రాజ్ భవన్‌లో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ అసోసియేషన్ హైదరాబాద్ చైర్మన్ భీంరెడ్డి, హైదరాబాద్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ వి. నవీన్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జ్యోతి, సాయినాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి 43లక్షల ఆస్తిపన్ను చెక్కు అందజేత



వెటర్నరీ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ఉదయ్‌కుమార్ నుంచి ఆస్తిపన్ను చెక్కును స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

బండ్లగూడ, మార్చి 21 : రాజేంద్రనగర్ వెటర్నరీ విశ్వవిద్యాలయానికి సంబంధించిన ఆస్తి పన్ను రూ. కోటి 43 లక్షల చెక్కును డీసీ రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్నుదారులు తమ పన్నును వెంటనే చెల్లించాలన్నారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 200 రెడ్ నోటిసులను జారీ చేసినట్టు తెలిపారు. 35 మందికి వారెంట్‌ను కూడా జారీ చేస్తున్నట్లు తెలిపారు.

# నేటి నుంచి ఇంకుడు గుంతల సర్వే

- నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారుల సన్నాహాలు

జూబ్లీహిల్స్, మార్చి 21: కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో అడుగంటిపోతున్న భూగర్భ జలాలతో భవిష్యత్ తరాలకు నీటి చుక్క దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ గ్రేటర్‌లో నీటి మట్టం పెంచేందుకు బృహత్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు నేటి నుంచి ఇంకుడు గుంతల సర్వే చేపట్టనున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిర్దేశిత గృహాల్లో ఇంకుడు గుంతలు ఉన్నాయా లేదా గుర్తించనున్నారు. అంతేకాక ఆయా గృహాల యజమానులకు ఇంకుడు గుంతల ప్రాధాన్యాన్ని వివరించనున్నారు. ప్రపంచ నీటి దినోత్సవం మార్చి 22ను పురస్కరించుకుని నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ మేరకు గురువారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ పరిధిలో నేటి నుంచి చేపట్టనున్న ఈ అవగాహన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. శుక్రవారం జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ పరిధిలోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యంలో బల్దియా సిబ్బంది ఇంటింటి సర్వే, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ సేవా ఇస్లావత్

# ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ పీఓ హిమబిందు, సిబ్బంది

జూబ్లీహిల్స్, మార్చి 21: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయించుకోవాలని యూసీడీ యూసుఫ్‌గూడ సర్కిల్ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు పేర్కొన్నారు. దీంతో పాటు ఓటరు జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలని కోరారు. ఇంటర్నేషనల్ ఓల్డర్ పెర్సన్స్ డే పురస్కరించుకుని గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటరు నమోదు అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏండ్లు పైబడిన వారందరూ ఓటరుగా తమ పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. వందశాతం ఓటింగ్ నమోదు చేసేందుకు సీనియర్ సిటిజన్స్‌తో పాటు యువత కృషి చేయాలని అన్నారు. ఓటుహక్కు వచ్చిన ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో కమ్యునిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

అమీర్‌పేట్, మార్చి 21: సనత్‌నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరిగింది. ఐఐపీ కార్యాలయంలో జరిగిన ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో టీఎస్‌పీసీబీ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐపీ విద్యార్థులకు పూర్తిస్థాయి శాస్త్రీయ పద్ధతుల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐపీ హైదరాబాద్ ఏవో నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే



మార్కండేయనగర్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్వో డాక్టర్ అరుణ

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 21: కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు డీఎల్వో డాక్టర్ అరుణ పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లో గురువారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టువ్యాధి మైక్రో బ్యాక్టిరియం లెప్రి అనే క్రిమి ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఆశ కార్యకర్తలు ద్వారా వ్యాధి లక్షణాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఎంఓ సులోచన, లెప్రసీ నోడల్ పర్సన్ గౌరీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐఐఎంసీలో ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్




ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రఘువీర్

ఖైరతాబాద్, మార్చి 21: ఐఐఎంసీ కళాశాల ఆంగ్ల భాష విభాగం, ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్, ఐఎంఎస్ లెర్నింగ్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తాధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో ఆంగ్ల భాషపై ఉన్న పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను అంచనా వేయడం కోసం గురువారం కళాశాలలో అంతర్ కళాశాలల ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో తెలంగాణ వ్యాప్తంగా 40 కళాశాల నుంచి 590 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన హ్యాకథాన్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ, మార్చి 21: గండిపేట్‌లోని మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 'నిర్వాణ-2024' పేరుతో వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ఆరు రంగాలకు చెందిన అంశాల్లో పోటీలు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి వెయ్యికిపైగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారన్నారు. హ్యాక్సావి 24 విజేతలకు రూ. 2లక్షల 10వేల బహుమతిని అందజేశారు. హ్యాకథాన్ గురువారం ముగిసింది. కార్యక్రమంలో 'నిర్వాణ 24' వైస్ చైర్మన్ డాక్టర్ కె.రామాంజనేయులు, హ్యాక్సావి 24 కన్వీనర్ డాక్టర్ సీఆర్‌కే రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రమాబాబు, వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి : కార్పొరేటర్

హిమాయత్‌నగర్, మార్చి 21: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సమస్యను పరిష్కరించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్ నారాయణగూడ జలమండలి అధికారులను కోరారు. ఓల్డ్ కమేలా బస్తీలో డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న తాగునీరు పైపులైన్ పగిలిపోయి నీరు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో బస్తీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం బస్తీవాసులు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కార్పొరేటర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణమే పగిలిపోయిన పైపులైన్‌కు మరమ్మతు చేసి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు.

## యోగా పోటీల్లో తిరుమలహిల్స్ విద్యార్థుల ప్రతిభ



యోగాసన పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మణికొండ, మార్చి 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా మాస్టర్ కె.ప్రదీప్‌కుమార్ అన్నారు. జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో మణికొండ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచి పతకాలు సాధించారు. తిరుమలహిల్స్‌లో గురువారం వారికి డాక్టర్ అవినాశ్ సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేసి అభినందించారు. ప్రదీప్ మాట్లాడుతూ.. గత నెల కర్ణాటక శివమొగ్గలో వర్షిణి యోగా అసోసియేషన్ అండ్ కల్చరర్ ట్రస్ట్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన 6వ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ప్రశాంత్ కన్నన్, నిత్య అమూల్య ప్రథమ స్థానం, వరుణ్, ప్రసాద్ ద్వితీయ, అచ్చుత్, రాహుల్ కేత్, విష్ణు ప్రసన్య, రియాకేత తృతీయ స్థానంలో నిలిచి పతకాలు గెలుచుకున్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.రంగాచారి, నవీన్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉచిత విద్య, వైద్యంపై చట్టం తేవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రవీణ్‌కుమార్, తదితరులు

శంషాబాద్ రూరల్, మార్చి 21: ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా ఇచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని చేవెళ్ల లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో కిదిగనున్న అంకగల్ల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్ పట్టణంలో తన ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో నాయకులు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలపైనే సంక్షేమ భారం మోపుతున్నారని విమర్శించారు.దేశాన్ని అప్పులపాలు చేస్తున్నారని ఆరోపించారు. తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో చట్టం తీసుకువచ్చే విధంగా ప్రజల తరుపున పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

గోల్నాక, మార్చి 21 : గోల్నాక డివిజన్ అన్నపూర్ణనగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కా ర్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్‌కు వారు ఫిర్యాదు చేయగా ఆమె ఆదేశాలతో గురువారం సమస్యను బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. వెంటనే సం బంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింప చేయించి సమస్యను పరిష్కరించారు.

## వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్ మీట్

కాచిగూడ,మార్చి 21: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకొని, కొత్త క్రీడలపై అధ్యయనం చేయాలని కాచిగూడ వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్-2024లో భాగంగా క్రికెట్ పోటీలను గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ హాజరై మాట్లాడారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 21: ఆటో కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ కోరారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కాలే రాజు అధ్యక్షతన సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సమస్యలపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం పేరుతో ఉచిత బస్సు ప్రయాణం తీసుకురావడం వల్ల ఆటోలకు గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఫైనాన్స్ కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని, దీంతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా రూ. 4,500 భృతి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి మెహిదీపట్నం వరకు నడిపే ఆటో కార్మికులకు పర్మనెంట్ అడ్డా కల్పించాలని,సేద తీర్చుకోవడానికి షెడ్డు, మరుగుదోడ్లు, బాత్‌రూం వసతి కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ట్రాఫిక్ అధిక చలాన్ తగ్గించాలని, లైసెన్స్ లేని ఆటో కార్మికుడికి(ఆర్టీవో) అధికారులతో మాట్లాడి లైసెన్స్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఆరాంఘర్ ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు ఎండీ ఇమ్రాన్, ఎస్.రాజు, సల్మాన్, పి.వినోద్, ఖలీక్, శంకర్‌నాయక్, లోకేశ్, ఆకాశ్ రాథోడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సామాజికవర్గ రాజ్యం వచ్చింది..

- ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేయొద్దు..
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, మార్చి 21: తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆయన సామాజికవర్గ రాజ్యం వచ్చిందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా అయిన మాదిగలకు ఏ పార్టీ కూడా సరైన న్యాయం చేయలేదన్నారు. మాదిగలకు పెద్దపీట వేసింది ఒక్క బీజేపీ మాత్రమేనని, వర్గీకరణ సైతం త్వరలోనే సాకారం కాబోతుందని తెలిపారు. మాదిగలంతా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. సీఎం మాలలను ముందు వేసుకొని మాదిగలకు మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజుమాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ, ఏపీ అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్‌మాదిగ, విజయ్, లక్ష్మణ్, కొమ్ము శేఖర్, సతీశ్, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

# మల్లినాథసూరి రచనలపై పరిశోధనలు జరగాలి

## ప్రొఫెసర్ నీలకంఠం



సంస్కృత అకాడమీ ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 21: ప్రముఖ సంస్కృత పండితుడు కోలాచల మల్లినాథసూరి రచనలపై విస్తృత పరిశోధనలు జరగాలని ఉస్మానియా యూనివర్సిటీలోని సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం అన్నారు. నేటి యువ సంస్కృత పండితులు ఆ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. అకాడమీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మల్లినాథసూరి వాఙ్మయ సదస్సు గురువారంతో ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపించేందుకు ప్రయత్నించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని విశ్వవిద్యాలయం స్థాపించాలని కోరారు. తెలంగాణలో కూడా సంస్కృత విశ్వవిద్యాలయం స్థాపిస్తే రాష్ట్రంలోని ఉత్సాహవంతులైన విద్యార్థులకు సంస్కృతం చదువుకునే అవకాశం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అకాడమీ ముద్రించిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ దోర్బల ప్రభాకరశర్మ, ప్రొఫెసర్ విద్యానంద ఆర్య, తిరుపతి వేదవిశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ పవన్‌కుమార్ శర్మ, మహామహోపాధ్యాయ నల్లగొండ పురుషోత్తమ శర్మ, ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జోషి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## రేపటి నుంచి బీసీ జోడో సామాజిక న్యాయయాత్ర



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, మార్చి 21: తెలంగాణలోని 33 జిల్లాలలో ఈ నెల 23 నుంచి బీసీ జోడో సామాజిక న్యాయ యాత్రను నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యు డు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్రాల బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 10 సీట్లు కేటాయించి, బీసీ డిమాండ్లపై విధి, విధాన ప్రకటన చేసి మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 56 కార్పొరేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్, మార్చి 21: ఖాళీగా తిరగకుండా ఏదైనా పనిచేసుకోవచ్చు కదా.. అంటూ తల్లి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్ రోడ్ నం. 9లోని అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటున్న శనిగరం కిరణ్(20) ఏ పనిచేయకుండా స్నేహితులతో కలిసి తిరుగుతుంటాడు. ఏదైనా పనిచేసుకోవాలంటూ తల్లి, కుటుంబ సభ్యులు చాలాసార్లు నచ్చజెప్పారు. వారి మాటలు వినిపించుకోకపోవడంతో పాటు గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చిన కిరణ్‌ను మరోసారి తల్లి మందలించింది. అర్ధరాత్రి వరకు ఎందుకు తిరుగుతున్నావంటూ ప్రశ్నించగా.. తల్లితో గొడవ పడిన కిరణ్ గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. అరగంట తర్వాత తల్లి గదిలోకి వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. స్థానికుల సాయంతో అతడిని చికిత్స నిమిత్తం అపోలో జనరల్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.